సిన్సియారిటీకి నజరానా బదిలీ!

ట్రాఫిక్ ఏసీపీ నుంచి మళ్లీ టీటీఐకు శంకర్‌రాజు



సనత్‌నగర్: నార్త్‌జోన్ ట్రాఫిక్‌–1 ఏసీపీగా శంకర్‌రాజు బాధ్యతలు చేపట్టిన మూడు నెలల్లోనే గోడకు కొట్టిన బంతిలా మళ్లీ టీటీఐ (ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఏసీపీగా బదిలీ చేయడం ఇప్పుడు పోలీసు డిపార్ట్‌మెంట్‌లో చర్చనీయాంశమైంది. టీటీఐలో ఉన్నా, ట్రాఫిక్‌లో ఉన్నా ప్రజోపయోగార్థం వినూత్న కార్యక్రమాలను చేపడుతూ ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చారు. ట్రాఫిక్ నిబంధనల అమలుపై ఒక ఉద్యమాన్నే నడిపిస్తున్న ఆయనను ఉన్నటుండి బదిలీ చేయడం వెనుక ఆంతర్యమేమిటో అని చర్చించుకుంటున్నారు. సిన్సియర్‌గా పనిచేసే అధికారికి ఇదా బహుమతి అంటూ పలువురు గుసగుసలాడుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు టీటీఐ ఏసీపీగా ఉన్న ఆయనకు నార్త్‌జోన్ ట్రాఫిక్‌–1 ఏసీపీగా బదిలీ చేశారు. బదిలీ చేసిన మూడు నెలల్లోనే మళ్లీ టీటీఐకి అటాచ్ చేయడం గమనార్హం.

టీటీఐకి సరికొత్త అర్థం చెప్పిన అధికారి..

2022 జనవరికి ముందు వరకు టీటీఐ అంటే కేవలం మందుబాబులకు కౌన్సెలింగ్ ఇవ్వడం వరకే అందరికీ తెలుసు. అలాంటిది శంకర్‌రాజు టీటీఐ ఏసీపీగా బాధ్యతలు తీసుకున్న తరువాత టీటీఐ అర్థాన్నే మార్చేశారు. మద్యం తాగి పట్టుబడిన తర్వాత కౌన్సెలింగ్ చేయడం కన్నా మద్యం తాగి డ్రైవింగ్ చేయవద్దంటూ ఒక విధంగా అవగాహన యుద్ధాన్నే చేశారు. టీటీఐ ద్వారా చేపట్టిన కార్యక్రమాలకు వేదిక కాని కళాశాలలు, పాఠశాలలు, ప్రైవేటు సంస్థలు లేవంటే అతిశయోక్తి కాదు. టీటీఐ ఏసీపీగా 1238 అవగాహన కార్యక్రమాల ద్వారా 1,57,427 మందికి ట్రాఫిక్, రోడ్డు సేఫ్టీ నిబంనంధనలపై ఆయన అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైన ప్రయాణికులకు గోల్డెన్ అవర్స్‌లో ప్రాణాలు ఎలా నిలపాలో సీపీఆర్‌పై శిక్షణ ఇప్పించారు.



గురువారం కురిసిన వర్షానికి వరద సాఫీగా పారేలా చర్యలు చేపడుతున్న శంకర్‌రాజు

చేపట్టిన కార్యక్రమాలు..

ప్యారడైజ్, ప్యాట్నీ లాంటి ప్రాంతాల్లో సమయపాలన పాటించకుండా రోడ్ల మీదకు వచ్చే వాహనాల విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించి వారికి హుకుం జారీ చేశారు. తోపుడు బండ్లు, రోడ్ల పక్కన ఉండే చిరు వ్యాపారుల నుంచి వసూలు చేసే అమ్యామ్యాలకు అడ్డుకట్ట వేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు కృష్ణయాదవ్ కుటుంబానికి నార్త్‌జోన్ ట్రాఫిక్ సిబ్బంది అందించిన విరాళాల రూపేణా రూ.2,50,000లను అందించారు. అధిక శబ్దం చేసే మోటార్ సైకిళ్ల సైలెన్సర్లను తొలగించడంలో కీలకంగా వ్యవహరించారు. గురువారం కురిసిన కుండపోత వర్షానికి రోడ్లపై చేరిన వరదనీటితో భారీగా ట్రాఫిక్ స్తంభించడంతో నేరుగా ఆయన రంగంలోకి దిగి దగ్గరుండి జీహెచ్ఎంసీ సిబ్బంది సహకారంతో వరదనీటి అడ్డంకులను తొలగించి ట్రాఫి సాఫీగా వెళ్లేలా చేశారు. అనతికాలంలోనే ట్రాఫిక్ విభాగంలో కీలకంగా వ్యవహరించిన అధికారిని తిరిగి టీటీఐకే బదిలీ చేయడం పట్ల సర్వత్రా చర్చ కొనసాగుతోంది.

‘వీసీ తీరు సరికాదు’

ఉస్మానియా యూనివర్సిటీ: పీఆర్‌సీ అమలుపై వీసీ ప్రొ.రవీందర్ అనుసరించిన తీరుపై ఔటా (ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్) అధ్యక్షులు ప్రొ.మనోహర్ మండిపడ్డారు. నాలుగు రోజుల్లో ముగియనున్న తన పదవీ కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ అనుమతి లేకున్నా 2016 నుంచి వీసీ ప్రొ.రవీందర్ పీఆర్‌సీ బకాయిలను విడుదల చేయించుకోవడం దారుణమన్నారు. వేతన బకాయిలను 2016 నుంచి జూన్ 2019 వరకు ఉద్యోగ విరమణ పొందిన అధ్యాపకులకు మాత్రమే చెల్లించనున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడం వెనుక వీసీ స్వార్థం ఉందన్నారు. అందరి బాగోగులు చూడాల్సిన వీసీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం పని చేయడం దారుణమన్నారు. పీఆర్‌సీని అందరికి వర్తింపజేయాలని లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని ప్రొ.మనోహర్ హెచ్చరించారు.

డిజిటల్ తరగతి గదులు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతి గదులను శుక్రవారం వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీ నారాయణ ప్రారంభించారు.

అదుర్స్.. వియోన మేధస్సు

లాలాపేట: సరిగ్గా మాటలు సైతం రాని ఓ చిన్నారి తన మేధస్సుతో అదుర్స్ అనిపించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించింది. సదాశివపేటకు చెందిన సుమన్ (యుకే లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు),రేఖ దంపతుల తొమ్మిది నెలల కుమార్తె బేబీ వియోన తన మేధస్సుతో రకరకాల వస్తువులు, జంతువులు, పక్షులు, పండ్లు, కూరగాయల బొమ్మలు, ఆకారాలు, రంగులు ఇలా సుమారు 100 నుంచి 150 వరకు ఫ్లాష్ కార్డ్స్‌లో అడిగిన పేర్లను అడిగిన వెంటనే ఇట్టే గుర్తు పట్టి చూపిస్తుంది. పిన్న వయస్సులోనే పలు రకాలైన వస్తువులను గుర్తిస్తున్న బేబీ వియోన మేధాశక్తిని పరిగణలోకి తీసుకుని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా. చింతపట్ల వెంకటాచారి తెలిపారు. దీనికి సంబంధించిన రికార్డు సర్టిఫికెట్‌ను మెయిల్ ద్వారా డిజిటల్‌గా పంపించారు. దీన్ని లండన్‌లో బ్రాక్నెల్ సిటీ కౌన్సిలర్ గ్రాంట్ స్ట్రుడ్లే చేతుల మీదుగా చిన్నారికి సర్టిఫికెట్‌ను అందజేశారు. అతిచిన్న వయస్సులోనే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడంపై బేబి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



వియోనాకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న దృశ్యం

రూ.5 లక్షల విరాళం అందజేత

ఉస్మానియా యూనివర్సిటీ: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాన తత్వంపై ఉపన్యాసం కోసం విశ్వ కర్మ ఫౌండేషన్ అధ్యక్షులు అట్లూరి రవీంద్రాచారి శుక్రవారం ఓయూ వీసీ ప్రొ.రవీందర్‌కు రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. సదరు డబ్బులను బ్యాంక్‌లో డిపాజిట్ చేసి వచ్చే వడ్డీతో ప్రతి ఏటా మే 17న వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన దినోత్సవం సందర్భంగా ఆయన పేరు మీద స్మారక ఉపన్యాసం జరిపించాలని కోరినట్లు అట్లూరి రవీంద్రాచారి తెలిపారు.



23న అన్నమాచార్య జయంతి



చిక్కడపల్లి: నవ్యనాటక సమితి, అన్నమాచార్య మిషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ తాళ్ళపాక అన్నమాచార్య 616 జయంతి మహోత్సవాన్ని 23న నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల ప్రతినిధులు వేమరాజు విజయన్‌కుమార్, కామిశెట్టి గోదా లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో రాష్ట్ర జనాభా లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్యాగరాయగానసభలో జరిగే ఈ కార్యక్రమంలో 11మంది నత్యగురువులు 50 మంది శిష్యురాళ్లతో శ్రీ పదార్చణ శీర్షికతో అన్నమాచార్య సంకీర్తనలకు కూచిపూడి, భరత నాట్య నృత్యరీతులో నృత్య ప్రదర్శన ఇస్తారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి, ప్రముఖులు రజిత్ ఆకుల, డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, పద్మినీ మాచాని, పి.వి జయకుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

అడ్డగుట్ట: పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం– గుండ్ల పోచంపల్లి రైల్వే స్టేషన్ల మార్గమధ్యలోని పట్టాలపై శుక్రవారం ఉదయం సుమారు 60–65 మధ్య వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు తెలుపు రంగు షర్ట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

రాంగోపాల్‌పేట్: గుర్తు తెలియని ఓ మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వేణుగోపాల్ వివరాల ప్రకారం.. బోయిగూడ రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు 108 సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా చనిపోయినట్లు నిర్ధారించారు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడికి 45–50 ఏళ్ల వయస్సు ఉంటుందని, బూడిద రంగు టీ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని సంబంధీకులు ఎవరైనా ఉంటే గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

చికిత్సకు వచ్చిన వ్యక్తి అదృశ్యం



శశిధర్

రాంగోపాల్‌పేట్: మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి తప్పిపోయిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం భద్రాచలంకు చెందిన వీరబ్రహ్మం భార్యతో పాటు కుమారుడు శశిధర్ (30)తో కలిసి ఈ నెల 15వ తేదీన నగరానికి వచ్చాడు. శశిధర్‌కు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఎర్రగడ్డలోని మానసిక చికిత్స కేంద్రంలో చికిత్స తీసుకుంటున్నారు. అదే రోజు గచ్చిబౌలిలోని ఆయన మరో కుమారుడి ఇంట్లో ఉన్నారు. మరోసటి రోజు తండ్రి కుమారుడు ఎర్రగడ్డలోని ఆస్పత్రి చికిత్స కోసం వెళ్లారు. అక్కడి నుంచి దిల్‌సుఖ్‌నగర్‌లో బస్ పాస్ రెన్యూవల్ చేసుకుని అక్కడి నుంచి ఇద్దరూ 107లో సికింద్రాబాద్‌లోని రెతిఫైల్ బస్టాండ్‌కు వచ్చి అక్కడి నుంచి గచ్చిబౌలికి వెళ్లాల్సి ఉంది. రెతిఫైల్ బస్టాండ్ వద్ద ఇద్దరు రోడ్డు దాటుతుండగా శశిధర్ కనిపించలేదు. చుట్టుపక్కలా వెతికినా ఆచూకీ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ప్రకాష్‌నగర్, హెచ్‌పీఎస్, బేగంపేట్, మైత్రీవనం, కుందన్‌బాగ్, ఆల్విన్, ఐడీపీఎల్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 6.30 గంటల వరకు ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ఆర్యా మసీదు, రిజిస్ట్రేషన్ ఆఫీసు లేన్. ఉదయం 6.30 నుంచి 7 గంటల వరకు గురుమూర్తిలేన్, తాతాచారికాలనీ, ఆర్‌బీఐ క్వార్టర్స్, బొంబే హల్వా కాంపౌండ్, ఎస్ఆర్‌నగర్ మెయిన్‌రోడ్డు, కమ్యూనిటీ హాల్ లేన్, ఆంధ్రాబ్యాంక్ లేన్, ఎస్‌బీహెచ్ బ్యాంక్ లేన్, చైతన్య జూనియర్ కాలేజ్, 2ఆర్‌టీ, 3ఆర్‌టీ క్వార్టర్స్. ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు సోనాబాయి టెంపుల్, సత్యం థియేటర్, స్పెన్సర్ బిల్డింగ్, ప్లేగ్రౌండ్ ఏరియా, శీష్‌మహల్ థియేటర్ ఏరియా. ఉదయం 7.30 నుంచి 8 గంటల వరకు కుందన్‌బాగ్ బీఎస్‌మక్తా, హుస్సేన్‌నగనర్, నిషాంత్‌బాగ్ కాలనీ, హనుమాన్ టెంపుల్, సుభానీ మసీదు ఏరియా, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, శాంతిశిఖర అపార్ట్‌మెంట్స్, అయ్యప్ప టెంపుల్ లేన్,చర్చి గల్లీ, టీవీఎస్ షోరూం లేన్, స్వాతి టిఫిన్స్ వెనుక కాలనీ. ఉదయం 8 నుంచి 8.30 వరకు సుందర్‌నగర్, మోడల్‌కాలనీ, మూసాపేట హెచ్‌పీ రోడ్డు, లక్ష్మీకళ థియేటర్ ఏరియా, శ్రీరాములు థియేటర్ ఏరియా, అశ్వని హెయిర్ ఆయిల్ లేన్. 8.30 నుంచి 9 గంటల వరకు బేగంపేట పోస్టాఫీసు, గీతాంజలి స్కూల్, బేగంపేట్ రైల్వే స్టేషన్, ఓల్డ్ కస్టమ్స్ బస్తీ, పీఎఫ్ క్వార్టర్స్, బ్రాహ్మణవాడీ, వరుణ్ టవర్స్ లేన్, మాతాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

కంటోన్మెంట్ ఏడీఈ పరిధిలో..

కంటోన్మెంట్: ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణాలతో సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.ఉదయం 6.00 గంటల నుంచి 6.30 గంటల వరకు అల్వాల్ ఫీడర్ పరిధిలోని రిట్రీట్ కాలనీ, భవానీ నగర్, వీబీఆర్ గార్డెన్స్ ప్రాంతాలు. 6.30 నుంచి 7 గంటల వరకు మచ్చబొల్లారం, భూదేవీ నగర్ ఫీడర్ల పరిధిలోని ఏఆర్‌కే హోమ్స్, రుక్మిణి ఎన్‌క్లేవ్, రైల్వే కాలనీ, శాంతినికేతన్ ఎన్‌క్లేవ్ గ్రీన్ ఫీల్డ్స్, కానాజీ గూడ, ప్రాంతాలు. 7 గంటల నుంచి 7.30 వరకు ఆర్‌పీ నిలయం, అల్వాల్ పరిధిలోని భాటియా బేకరీ, వెంకట్రావు పేట, హెచ్ఎంటీ, పంచశీల్ ప్రాంతాలు. 7.30 నుంచి 8 గంటల వరకు మచ్చ బొల్లారం పరిధిలోని సాయి రెడ్డి నగర్, శ్రీసాయి కాలనీ, కావేరీ ఎన్‌క్లేవ్, స్నేహ కాలనీ ప్రాంతాలు. 8 గంటల నుంచి 8.30 వరకు ఎంహెచ్ఆర్ కాలనీ, ఎరుకల బస్తీ, ధర్మారెడ్డి కాలనీ ప్రాంతాలు. ఉదయం 8.30 గంటల నుంచి 9.00 గంటల వరకు భూపతి రావు నగర్, శక్తి గణేశ్ నగర్, అల్వాల్ హిల్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఘనంగా వీర బ్రహ్మేంద్రస్వామి రథోత్సవం



స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న 115వ ఆరాధన గురుపూజ మహోత్సవాలు శుక్రవారం ముగిసాయి. చివరిరోజు హోమం, అభిషేకాలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సాయంత్రం స్వామి ఊరేగింపు రథోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లాలాపేట పురవీధుల్లో వీరబ్రహ్మేంద్రస్వామిని ఊరేగింపుగా తీసుకెళ్తుండగా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి సదానందాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

మూగ జీవాల రక్షణకు సమష్టిగా కృషి చేయాలి



సనత్‌నగర్: హైదరాబాద్ నగరంలో ఇటీవల బ్లూ (సైబీరియన్ హస్కీ) అనే కుక్కపై జరిగిన దాడిని తెలంగాణ కెనైన్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. బంజారాహిల్స్‌లోని జంతు సంరక్షణ ఆస్పత్రిలో పుర్రెపై ఫ్రాక్చర్‌తో బాధపడుతున్న కుక్కను సందర్శించి దాని ఆరోగ్య పరిస్థితిని అక్కడి డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు విశాల్ సూదం మాట్లాడుతూ.. కుక్కలపై దాడి అనాగరిక, క్రూరమైన చర్యగా పేర్కొన్నారు. కుక్కల సంక్షేమం, రక్షణ కోసం అంకితమైన కెనైన్ సంస్థ ప్రతినిధులుగా తాము ఈ దాడి పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామన్నారు. మూగ జీవాలకు రక్షణ కరువైందని భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అధిక రక్తపోటుపై జాగ్రత్తలు అవసరం

కాచిగూడ: ఉరుకులు..పరుగుల జీవితంలో మనిషి తన ఆరోగ్యాన్ని కాపాడుకోడాన్ని విస్మరిస్తున్నాడని.. అది అత్యంత ప్రమాదకరమని టీఎక్స్ హాస్పటల్స్ డైరెక్టర్లు డాక్టర్ కీర్తికర్ రెడ్డి, డాక్టర్ దీపక్ రాజు, రవీంద్ర రామిరెడ్డి అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం కాచిగూడలోని టీఎక్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో 3కె వాక్‌థాన్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అధిక రక్తపోటుపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆధునిక జీవన శైలి వల్ల రక్తపోటుకు గురయ్యే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని, అదే అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ సుమీత్ సిన్హా, డాక్టర్ దీపక్ సహా, డాక్టర్ జె.శశి, డాక్టర్ పృధ్వీ, డాక్టర్ అవినాష్ దాల్, డాక్టర్ సోహైల్ సయ్యద్, డాక్టర్ చంద్రకాంత్, శ్రీకాంత్ వోడ్నాల, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

పార్కు వద్ద అక్రమ పార్కింగ్



చిలకలగూడ జీహెచ్ఎంసీ నాగులూరి పార్కు ప్రధాన ద్వారానికి అడ్డంగా కార్లు, వ్యాన్లు, ఆటోలు అక్రమంగా పార్కింగ్ చేయడంతో పార్కుకు వచ్చే వారు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన యజమానులు పార్కు చుట్టూ అక్రమంగా తమ వాహనాలను పార్కింగ్ చేసి నెలల తరబడి అక్కడే వదిలివేస్తున్నారని ప్రశ్నించిన వారిపై దాడులకు సైతం దిగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ సమస్యపై ట్రాఫిక్ పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని వాపోతున్నారు. నెలల తరబడి పార్కింగ్ చేయడంతో వాహనాల కింద చెత్త చెదారం పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెలువడుతోందని జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది వాపోతున్నారు. –చిలకలగూడ

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చికాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 32, చామగడ్డ 45, మొరంగడ్డ 35, కందగడ్డ 70, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 8, మునగకాయ 3–4, ముల్లంగి 4–5.